క్లుప్తంగా

ప్రభుత్వ ఉపాధ్యాయుల బడిబాట



విద్యార్థి అడ్మిషన్ తీసుకుంటున్న ఎంఈవో

కథలాపూర్: మండలంలోని దుంపేటలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు ఇంటింటా తిరిగి విద్యార్థుల పేర్లు నమోదు చేసుకున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఆనందరావు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం అర్జున్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



టాపర్లను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

మల్లాపూర్: ఇంటర్ ఫలితాల్లో తమ పూర్వ విద్యార్థులు సత్తా చాటడం అభినందనీయమని కేరళ హైస్కూల్ ప్రిన్సిపాల్ సీబీ.అనిల్ సింగ్ అన్నారు. ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన కేరళ హైస్కూల్ పూర్వ విద్యార్థులు కాటిపెల్లి సాహిత్య, మామిడాల నితిషా, కాటిపెల్లి మనిషా, మామిడాల రవళి, బద్దం అఖిలను శుక్రవారం సన్మానించారు. ఈ విద్యార్థులందరూ భవిష్యత్‌లో మరింత ఉన్నతమైన స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

గణపతి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామశివారుల్లో రూ. 12 లక్షలతో పురాతన గణపతి ఆలయ పునఃనిర్మాణానికి శుక్రవారం గ్రామస్తులు భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన ధన్నపునేని సంజీత్‌రావు-కళ్యాణి దంపతులు (యూఎస్ఏ) ఆలయ నిర్మాణం కోసం తమ వంతు పూర్తి సహకారం అందించడానికి ముందుకు వచ్చారు. దీంతో ఆలయ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుడిసె జితేందర్, గుట్టరాజేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కొల్లూరి ప్రభాకర్, నాయకులు పూదూరి రమేష్, మ్యాడ జనార్ధన్, చుంచు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భూపతిపూర్‌లో అండర్- 14 ప్రీమియర్‌లీగ్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న జట్లు

రాయికల్: మండలంలోని భూపతిపూర్‌లో విజేత స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలోశుక్రవారం అండర్ - 14 ప్రీమియర్‌లీగ్ క్రికెట్ పోటీలను స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు సోమ రమేశ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కోచ్ మంగళారపు ఆనంద్, పీఈటీలు ప్రతాప్, దేవేందర్, విక్రమ్ పాల్గొన్నారు.

మోదీ హయాంలోనే పేదల జీవితాల్లో వెలుగులు



కథలాపూర్: ప్రధాని మోదీ హయాంలోనే పేదల్లో వెలుగులు నింపారని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి మద్దతు ఇవ్వాలని బీజేపీ వేములవాడ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో శక్తి కేంద్రాల బాధ్యులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషి చేసే బీజేపీ ఎంపీ అభ్యర్థి సంజయ్‌కుమార్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

2జీ ఫోన్లతో పనిచేసేదెలా?

- అంగన్‌వాడీలకు ఇబ్బందులు
- పనిచేయని ఫోన్లు
- 5జీ ఫోన్లు పంపిణీ చేయాలని కోరుతున్న అంగన్‌వాడీ టీచర్లు



అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఫోన్లు (ఫైల్)

పెగడపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో అధికారులతో పాటు అంగన్‌వాడీ టీచర్ల పాత్ర కీలకం. తల్లిదండ్రుల సంరక్షణ, పూర్వ ప్రాథమిక విద్య, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అనుబంధ పోషకాహార పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు, జనాభా లెక్కలు, ఎన్నికల విధులతో పాటు ఇతర విధులు నిర్వహించడంలో అంగన్‌వాడీ టీచర్లదే ప్రధాన భూమిక. జిల్లాలో మొత్తం నాలుగు ప్రాజెక్టులుండగా 1065 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 48,991 మంది మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు, 6389 గర్భిణులు, 6569 బాలింతలున్నారు. వారి విధుల నిర్వహణకు సంబంధించిన సమాచారం ప్రతిరోజు వీరు నమోదు చేయాల్సి ఉంటుంది. వీటితో పాటు వివిధ సర్వేలు చేసి నమోదు చేసేందుకు 2021లో వీరికి సెల్‌ఫోన్లు ప్రభుత్వం పంపిణీ చేసింది. ఉద్దేశం మంచిదైనప్పటికీ వారికి అందించిన సెల్‌ఫోన్లు సరిగ్గా పని చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికే 5జీ వస్తున్నప్పటికీ 2జీ స్టోరేజీ తక్కువగా ఉండటంతో నమోదు చేయడానికి ఇబ్బందిగా మారిందని టీచర్లు వాపోతున్నారు. వారి విధులతో పాటు అదనంగా కుటుంబ సర్వేలు కూడా పొందపర్చాలని ఉన్నతాధికారుల నుంచి ఇటీవల ఆదేశాలు రావడంతో వారు ఇంటింటా సర్వే చేస్తున్నారు. సర్వే వివరాలు నమోదు చేయాలంటే అంగన్‌వాడీ టీచర్లు సెల్‌ఫోన్ సమస్యతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమకు 5జీ సెల్‌ఫోన్లు అందించి ప్రతిరోజు డాటా ఎంట్రీ చేసేందుకు 2 జీబీ అవకాశం ఇవ్వాలని వారు వేడుకుంటున్నారు. అయితే వారం రోజులుగా అంగన్‌వాడీ టీచర్లకు అందించిన సెల్‌ఫోన్లు పనిచేయడం లేదని తెలుస్తోంది. దీంతో వారు కేంద్రాలకు సంబంధించిన రోజు వివరాలను సొంత ఫోన్లలో నమోదు చేస్తున్నట్లు అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి



ప్రస్తుత పరిస్థితుల్లో 5జీ పోన్లు వినియోగం జరుగుతోంది. తమపై పని భారం పెంచుతున్న అధికారులు ఎదురవుతున్న ఇబ్బందులు పట్టించుకోవడం లేదు. 5జీ సామర్థ్యం గల సెల్‌ఫోన్లు, మినీ ట్యాబులు అందిస్తే అంగన్‌వాడీ టీచర్లు సమాచారం నమోదు చేసేందుకు సులభతరంగా ఉంటుంది.

– రజిత, అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు

ఇబ్బందులు పడుతున్నాం



తమకు అందించిన తక్కువ సామర్థ్యం గల ఫోన్లలో సమాచారం నమోదు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి వచ్చిన ఫోన్లు పని చేయడం లేదు. దీంతో మా ఫోన్లలో ఐసీడీఎస్‌కు సంబంధించిన మాడ్యూల్స్ డౌన్‌లోడ్ చేసుకుని సమాచారం నమోదు చేస్తున్నాం.

– మణెమ్మ, అంగన్‌వాడీ టీచర్ల సంఘం నాయకురాలు, పెగడపల్లి

ప్రతిపాదనలు పంపించాం



అంగన్‌వాడీ టీచర్లకు అందించిన సెల్‌ఫోన్ల సామర్థ్యం తక్కువగా ఉండడంతో వివరాలు నమోదు చేయడంలో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను నా దృష్టికి అంగన్‌వాడీ టీచర్లు తీసుకొచ్చారు. అధిగమించేందుకు ప్రభుత్వ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతాం.

– వాణిశ్రీ, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో, జగిత్యాల జిల్లా

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

కోరుట్ల/కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేట మాజీ సర్పంచ్ సరికెల్ల మల్లా రెడ్డి సహ పలువురు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం, మాజీ ఏఎంసీ చేర్మెన్ బోయిన్‌పెల్లి సత్యం రావు, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మైలారపు లింబాద్రితో పాటు ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు రాంబాబు కాంగ్రెస్‌లో చేరారు. పట్టణంలో గురువారం రాత్రి జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో వారు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ నిజామాబాద్ ఎంపీగా జీవన్ రెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు.

మొబైల్ చలివేంద్రం..

పట్టణంలో షేక్ హుస్సేన్ అండ్ బ్రదర్స్ గ్యాస్ వెల్డింగ్ సహకారంతో ఎంఏ రహీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ చలివేంద్రాన్ని జువ్వాడి నర్సింగరావు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎంబేరి నాగ భూషణం, జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు వసీం తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి సహకార సంఘం చైర్మన్‌గా తిరుపతిరెడ్డి

మెట్‌పల్లి: మెట్‌పల్లి విశాల సహకార పరపతి సంఘం చైర్మన్‌గా కొమిరెడ్డి తిరుపతిరెడ్డి ఎన్నికయ్యారు. సంఘ కార్యాలయంలో శుక్రవారం డీసీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో నూతన చైర్మన్ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి పది మంది డైరెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ పదవికి తిరుపతిరెడ్డి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు డీసీవో ప్రకటించారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజీత్‌రావు, సుప్రీం కోర్టు న్యాయవాది కొమిరెడ్డి కరం, పలువురు నాయకులు తిరుపతిరెడ్డిని అభినందించారు.

బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా తిరుపతిగౌడ్

రాయికల్: మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన జోగినిపల్లి తిరుపతిగౌడ్‌ను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతిగౌడ్ మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

మల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల విశ్వాసాన్ని పొందాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మండల ఇన్‌చార్జి రుద్ర శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీనాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా భారతదేశం అన్నిరంగాల్లో అద్భుతమైన పురోగతిని సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల విశ్వాసాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు లవంగ శివకుమార్, సీనియర్ నాయకుడు కొడిమ్యాల రాజేందర్, ఎగ్గారపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎస్సై సాయం

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన బద్ది లింగయ్యకు గుడిసె ఇటీవల కాలిపోగా, బాధిత కుటుంబానికి బీర్‌పూర్ ఎస్సై గౌతంపవార్ శుక్రవారం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. బీర్‌పూర్ కట్టకింది గూడెం గిరిజన కాలనీకి చెందిన లింగయ్య గుడిసె ప్రమాదవశాత్తు కాలిపోయి, నగదు, బంగారం, ఇతర వస్తువులు, నిత్యావసర సరుకులు కాలిపోయాయి. దీంతో ఎస్సై సాయం అందించారు. ఈ సందర్భంగా ఎస్సైకి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. లింగయ్య కుటుంబానికి దాతలు సాయం చేయాలని ఎస్సై కోరారు.

రాబోయేది కాంగ్రెస్ డబుల్ ఇంజన్ సర్కారే



మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

మల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో రాబోయేది కాంగ్రెస్ డబుల్ ఇంజన్ సర్కారేనని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డితో కలిసి మాట్లాడారు. దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువత.. ఆ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన ప్రభుత్వాల బాధ్యతన్నారు. 2014లో ఏటా 2కోట్ల ఉద్యోగాలను ఇస్తామన్న ప్రధాని మోదీ, బీజేపీ కేంద్రప్రభుత్వం 10 ఏళ్ల గడిచిన ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేకపోయాడని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రాజోజి సదానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెరుమాండ్ల సత్యనారాయణ, మండల నాయకులు పాల్గొన్నారు.

యువకుడికి అభినందన

జగిత్యాల క్రైమ్: తనకు దొరికిన పర్స్‌ను పోలీసులకు అప్పగించిన యువకుడిని పోలీసులు అభినందించారు. బుగ్గారం మండల కేంద్రానికి చెందిన ఓ యువతి తన పర్స్‌ను జగిత్యాల ఉమెన్స్ డిగ్రీ కళాశాల వద్ద పాగొట్టుకుంది. ఈ పర్స్ సిరికొండ గ్రామానికి చెందిన కట్ట మారుతికి దొరికింది. మారుతి ఈ విషయాన్ని కానిస్టేబుల్ సంతోష్‌కు సమాచారం ఇవ్వగా, టౌన్ సీఐ వేణుగోపాల్‌కు అప్పగించారు. పర్స్ పోగొట్టుకున్న యువతి అడ్రస్ ఆధారంగా ఆమెను స్టేషన్‌కు రప్పించి మారుతితో యువతికి అందించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహుల పల్లె గ్రామంలో జరుగుతున్న శ్రీమడేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, ఎంపీటీసీ ఎడ్ల సృజనాసుశీన్, నాయకులు రామచంద్రంగౌడ్, మెరుగు రాజేశం తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కోరుట్ల: మే డే దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. పట్టణంలో శుక్రవారం మేడే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ 1920 లో ఆవిర్భావమై కార్మికుల చట్టాల కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో హమాలీ, మున్సిపల్, బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వంశీ, చాంద్ పాషా, గంగారాం, రవి, శ్రీనివాస్, సాయిలూ, ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీకి పలువురి రాజీనామా

జగిత్యాల: బహుజన సమాజ్ పార్టీకి జిల్లాకు చెందిన కీలక నేతలు రాజీనామా చేశారు. మద్దెల నారాయణ, దేవిసింగ్ రాథోడ్ అనివార్య కారణాల వల్ల రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

మామ కోసం కోడలు ప్రచారం



ప్రచారం చేస్తున్న కోడలు చరిష్మారెడ్డి

రాయికల్: కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా ఆయన కోడలు తాటిపర్తి చరిష్మారెడ్డి మండలంలోని వీరాపూర్‌లో శుక్రవారం ప్రచారం చేశారు. ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తాటిపర్తి హరితరెడ్డి, డాక్టర్ గురువారెడ్డి, డాక్టర్ మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, ప్రధాన కార్యదర్శి మహేందర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ గోపి మాధవి, నాయకులు మహిపాల్‌రెడ్డి, రామస్వామిగౌడ్, వెంకటేశ్, గంగారాం ,మల్లిక్ పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డికి మద్దతుగా..

సారంగాపూర్: నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం బీర్‌పూర్ మండలం మంగేళ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీలను కలిసి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు 5 నెలల్లో అమలు చేసిన హామీలను ఓటర్లకు వివరించారు. జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేశ్, వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు చెర్పూరి సుభాశ్, నాయకులు పాల్గొన్నారు.

తండ్రి గెలుపు కోసం తనయ..



దోమలకుంటలో ఓట్లు అభ్యర్థిస్తున్న నందిని

పెగడపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను ఎంపీగా గెలింపించాలని కోరుతూ శుక్రవారం ఆయన తనయ నందిని ఎన్నికల ప్రచారం చేశారు. పెగడపల్లి మండలంలోని దోమలకుంటలో ఎమ్మెల్యేగా, మంత్రిగా ఈశ్వర్ చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటా వివరిస్తూ కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్‌గౌడ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కొప్పులను గెలిపించాలని ప్రచారం

ధర్మపురి: పెద్దపల్లి ఎంపీగా కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని ఆరెపెల్లి శివాలయంలో నాయకులు శుక్రవారం పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటా ప్రచారం చేసి, కొప్పుల ఈశ్వర్ చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేష్, నాయకులు సొల్ల భీమయ్య, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు మొగిలి శేఖర్, ఎంపీటీసీ రవిత పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ ఆకాంక్షలు నెరవేరుతాయి



ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

మల్యాల: బీఆర్ఎస్‌తోనే తెలంగాణ ఆకాంక్షలు నెరవేరుతాయని, బీజేపీ మోసపూరిత మాటలు నమ్మవద్దని, వినోద్‌కుమార్‌తోనే అభివృద్ధి సాధ్యమని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని మద్దుట్లలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నిరుపేదల పక్షాన నిలిచి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే వినోద్‌కుమార్‌ను కరీంనగర్ ఎంపీగా గెలిపించాలని కోరారు. ఆయన వెంట పాక్స్ చైర్మన్ బోయినపల్లి మధుసూదన్‌రావు, తదితరులు ఉన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

జగిత్యాల: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెన్షనర్స్ భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. భవిష్యత్‌లో పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కావాలంటే కలిసికట్టుగా పోరాటం చేయాలన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని గెలిపించుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు పరిష్కారం జరుగుతుందని, జీవన్‌రెడ్డి గెలుపునకు అందరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పెన్షనర్స్ నాయకులు గంగరాజం, శంకర్, బీఎస్.రాములు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే



పెగడపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, అంగన్‌వాడీ టీచర్లు

పెగడపల్లి: మండల కేంద్రంలోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మహేశ్వరి మాట్లాడుతూ పిల్లల జీవితంలో మొదటి ఆరేళ్లు చాలా కీలక దశని ఈ దశలో పిల్లలకు అందించే ప్రేరణ, అనుభవాలు వారి భవిష్యత్తుకు సంపూర్ణ అభివృద్ధికి, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందన్నారు. పూర్వ ప్రాథమిక విద్య ప్రాధాన్యత, పౌష్టికాహారం, పోషక విలువలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు తదితర అంశాలపై పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రీ స్కూల్‌లో నేర్పించిన అంశాలను పిల్లల తో చేయించగా వారి తల్లులు ఆనందం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, భాగ్యమణి, వనజాత, సుజాత, రమ, ఆశ వర్కర్ సునీత, హెల్పర్లు పాల్గొన్నారు.

కిండర్ గార్డెన్‌లో..

ధర్మపురి: పట్టణంలోని ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ స్కూల్‌లో శుక్రవారం కిండర్ గార్డెన్ గ్రాడ్యువేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ కేజీ విద్యార్థులకు మెమొంటోలు బహూకరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తోట శంకర్, డైరెక్టర్ జి శ్రీనివాస్, అకాడమిక్ అడ్వైజర్ రాజేంద్రప్రసాద్, సంతోషి పాల్గొన్నారు.

పాఠశాలలో కల్చరల్ డే

రాయికల్: పట్టణంలోని ప్రగతి పాఠశాలలో కల్చరల్ డే వేడుకలు నిర్వహించారు. యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలశేఖర్, కరస్పాండెంట్ బాలె జయశ్రీ, డైరెక్టర్ నిఖిల్ పాల్గొన్నారు.

సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ

జగిత్యాలక్రైం: సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పట్టణ సీఐ వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిలో విస్తృత వాహనాల తనిఖీ చేపట్టారు. డాగ్‌స్క్వాడ్ బృందంతో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేయడంతో పాటు, కొన్ని వాహనాలకు జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎస్సైలు నరేశ్, మన్మథరావు పాల్గొన్నారు.